నిజామాబాద్ జిల్లా మాచారెడ్డి మండలం ఎల్లంపేటలో ధాన్యం కుప్పల మధ్య నిలిచిన వర్షపు నీరు

యాదాద్రి భువనగిరి జిల్లా సింగారం గ్రామ ఐకేపీ కేంద్రంలో తడిసిన ధాన్యం

రాజన్నసిరిసిల్ల జిల్లా లాల్‌సింగ్‌తండాలో ధాన్యపు రాశుల నుంచి నీటిని తొలగిస్తున్న రైతులు



రాజన్నసిరిసిల్ల జిల్లా వీర్నపల్లిలో నేలరాలిన మామిడికాయలు

కల్లంలో కన్నీళ్లు!

మొదటిపేజీ తరువాయి...

మూగజీవాలు మృతి చెందాయి. కామారెడ్డి జిల్లాలోని మాచారెడ్డి మండలంలో కురిసిన వర్షానికి ధాన్యపు రాశులు తడిసిపోయాయి.

తడిసిన 10 వేల క్వింటాళ్ల ధాన్యం

రాజన్న సిరిసిల్ల జిల్లా వీర్నపల్లి, ఇల్లంతకుంట మండలాల్లో శుక్రవారం సాయంత్రం ఈదురుగాలులతో కూడిన వానకు కొనుగోలు కేంద్రాల్లో ఆరబోసిన సుమారు 10 వేల క్వింటాళ్ల ధాన్యం తడిసి ముద్దయింది. చేతికొచ్చిన పంట పొలం నేలవాలింది. కోతకొచ్చిన దశలో మామిడికాయలు నేలరాలాయి. వీర్నపల్లి మండలం లాల్‌సింగ్ తండాలో గాలుల ధాటికి లోక్‌నాయక్ ఇంటి రేకులు లేచిపోయాయి. సుమారు రూ.50 వేల నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు. అదే గ్రామంలో గడ్డివాము, కరెంటు వైరు రోడ్డుపై పడటంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మండల వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో 600 క్వింటాళ్ల తూకం వేసిన ధాన్యం, 7,800 క్వింటాళ్ల తూకం వేయని ధాన్యం తడిసినట్టు ఏపీఎం నర్సయ్య తెలిపారు. ఇల్లంతకుంట మండలం జంగంరెడ్డిపల్లిలో పారిపెల్లి రాజిరెడ్డి పాడి గేదె పిడుగుపాటుతో మరణించింది. రూ.లక్ష నష్టం జరిగిందని బాధితుడు తెలిపారు.

పాలమూరు జిల్లాలో బీభత్సం

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం సాయంత్రం అర్ధరాత్రి వరకు నుంచి కురిసిన గాలి వాన బీభత్సం సృష్టించింది. పలుచోట్ల మామిడికాయలు నేలరాలాయి. విద్యుత్తు స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండలం నారాయణపూర్ గ్రామంలో సిరమోని జంగయ్య ఇంటిపై పిడుగు పడింది. ఆ సమయంలో ఇంట్లో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. పిడుగు ధాటికి స్లాబు, బాత్రూం రేకులు ధ్వంసం కాగా, కొన్ని దుస్తులు దగ్ధమైనట్టు బాధితుడు తెలిపారు.

యాదాద్రి జిల్లాలో 60 ఎకరాల్లో నష్టం

యాదాద్రి-భువనగిరి జిల్లా రాజాపేట మండలంలోని సింగారం, జాల, కొత్తజాల గ్రామాల్లో ఈదురుగాలులతో వడగండ్ల వర్షం కురిసింది. దాంతో వరి చేలు నేలవాలాయి. మామిడి కాయలు రాలాయి. కొట్టాల రేకులు ఎగిరిపోయాయి. కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. సుమారు 60 ఎకరాల్లో ధాన్యంతోపాటు మామిడి తోటలు దెబ్బతిన్నాయని అధికారులు ప్రాథమిక అంచనా వేశారు.

ఎకరాకు రూ.25 వేల పరిహారం ఇవ్వాలి: గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

అకాలవర్షంతో నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం యాదాద్రి జిల్లా రాజాపేట మండలం జాల గ్రామంలో వడగండ్ల వర్షంతో దెబ్బతిన్న వరి పొలాలతోపాటు నేలరాలిన మామిడి, ధ్వంసమైన కొట్టాలను ఆమె పరిశీలించారు. నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ గోపగాని బాలమణీయాదగిరిగౌడ్, బీఆర్ఎస్ మహిళాధ్యక్షురాలు ఎడ్ల బాలలక్ష్మి, మాజీ సర్పంచ్ గుంటి మధుసూదన్‌రెడ్డి, మదర్ డెయిరీ డైరెక్టర్ గొల్లపల్లి రాంరెడ్డి, బీఆర్ఎస్ సెక్రటరీ జనరల్ సందిల భాస్కర్‌గౌడ్, ఆలేరు మార్కెట్ మాజీ డైరెక్టర్ మర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

లోకం పోకడ



ఎండా కాలం

	గరిష్ఠం	కనిష్ఠం
ఆదిలాబాద్	45.2°c	27.0°c
నల్లగొండ	44.8°c	35.9°c
రంగారెడ్డి	42.8°c	21.2°c
నిజామాబాద్	42.4°c	29.5°c
మెదక్	42.2°c	26.1°c
ఖమ్మం	42.0°c	26.0°c
మహబూబ్‌నగర్	41.2°c	28.3°c
వరంగల్	41.0°c	28.0°c
హైదరాబాద్	40.2°c	28.3°c
కరీంనగర్	40.0°c	29.0°c

అమ్మబోతే.. అరిగోస

- వడ్లు అమ్మేందుకు నానా తిప్పలు
- కొనుగోలు కేంద్రాల్లో అడ్డమైన కొర్రీలు
- 15 రోజులు దాటినా కాని కాంటాలు
- దడపుట్టిస్తున్న చెడగొట్టువానలు
- సెంటర్లలో టార్పాలిన్లు కరువు
- విధిలేక వ్యాపారులవైపు రైతులు

సిద్దిపేట మండలం చిన్నగుండవెల్లి ఐకేపీ సెంటర్‌లో వడ్లను మరాడిస్తున్న రైతు నర్సింహులు దంపతులు

సిద్దిపేట, ఏప్రిల్ 19(నమస్తే తెలంగాణ ప్రతినిధి): నానా కష్టాల నడుమ యాసంగి పంట పండించి.. తీరా వడ్లను అమ్ముకుందామంటే రైతులకు అరిగోస తప్పడం లేదు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని చెబుతున్నా వాటిలో కనీస సౌకర్యాలు లేవు. ఓ వైపు చెడగొట్టు వానలు దడపుట్టిస్తున్నా.. నత్తకే నడక నేర్పేలా సాగుతున్న కొనుగోళ్లతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఏ గాలివానో వచ్చి పంట కొట్టుకుపోతే ఎట్లా దేవుడా అని బిక్కముఖం వేస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఐదారు రోజుల్లోనే వడ్లమ్ముడువోయి 72గంటల్లోనే ఖాతాలో డబ్బులు పడేవని గుర్తుచేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేశామని చెబుతున్న కొనుగోలు కేంద్రాల్లో కనీస వసతులు లేక ఒక్కో రైతుకు కనీసం పది రోజులు గడిచినా కాంటా కావడం లేదు. తాలు, తేమ అని అడ్డమైన కొర్రీలు పెడుతూ నిర్వాహకులు ఇబ్బందులు పెడుతుండడంతో కర్షకులు గగ్గోలు పెడుతున్నారు. సిద్దిపేట, మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 1,039 కేంద్రాలు ప్రారంభించినట్టు అధికారులు చెబుతున్నా ఇప్పటి వరకు ఉమ్మడి మెదక్‌లో సుమారు 7,650 మెట్రిక్ టన్నుల వడ్లను మాత్రమే కొన్నారు. కేంద్రాల్లో బార్దాని, ప్యాడీ క్లీనర్లు, టార్పాలిన్ కవర్లు సరిపడా లేవు. తూర్పారబట్టేందుకు ప్యాడీ క్లీనర్లు తెచ్చుకోవాలంటున్నారని రైతులు వాపోతున్నారు. బయట నుంచి తెస్తే గంటకు రూ.600 నుంచి రూ.700 అవుతున్నాయని ఆవేదన చెందుతున్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చి పది రోజులు దాటినా వడ్లు కాంటా కావడం లేదని చెబుతున్నారు. ఒకవేళ కాంటా అయినా మిల్లులకు పోవాలంటే మరో ఐదారు రోజులు పడుతోందని, ఇలా మొత్తం 15 రోజులు దాటుతోందని అంటున్నారు.

దిక్కులేక వ్యాపారుల వద్దకు

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో నానా కొర్రీలు పెట్టడం, రోజుల తరబడి కొనుగోళ్లు జరగకపోవడంతో రైతులు దిక్కులేక వ్యాపారులు, మిల్లులను ఆశ్రయిస్తున్నారు. మద్దతు ధర ఏ-గ్రేడ్ రకానికి రూ.2203, బీ-గ్రేడ్‌కు రూ. 2183 ప్రకటించినా గింజ చిన్నగా ఉందని, తాలు, తేమ ఉందని కుంటి సాకులు చెబుతూ బీ-గ్రేడ్ కింద కాంటా పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 40 కిలోల సంచికి దాదాపు కిలోన్నర వడ్లు కోత పెడుతున్నారు. రవాణా చార్జీలు అదనంగా మీద పడుతున్నాయి. అధికారులతో మిల్లర్లు కుమ్మక్కయి నిలువునా దోచుకుంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యాపారులు నేరుగా కల్లాల వద్దకే వచ్చి క్వింటాల్‌కు రూ. 1,950 నుంచి రూ.2,100 వరకు పెట్టి కొంటున్నారు. 40 కిలోల సంచికి రెండు కిలోలు కోత పెడుతున్నారు. రైతులే మిల్లులకు తీసుకపోతే రూ. 2150 వరకు ధర పలుకుతోంది. సంచికి కిలో చొప్పున కోత ఉంటున్నది. 15 రోజుల్లోగా డబ్బు చెల్లిస్తున్నారు. తక్షణమే డబ్బు కావాలంటే మొత్తం నుంచి మూడు శాతం తీసుకొని ఇస్తున్నారు. కొనుగోలు కేంద్రాలను పకడ్బందీగా నిర్వహించకపోవడం వల్లే ఈ దుస్థితి తలెత్తిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. కేసీఆర్ ప్రభుత్వంలో ఇలాంటి ఇబ్బందులు తలెత్తలేదని రైతులే చెబుతున్నారు. కేంద్రాలకు తీసుకెళ్లిన ఐదారు రోజుల్లోనే అమ్ముడుపోయి 72 గంటల్లోనే నేరుగా ఖాతాల్లో డబ్బు పడేదని గుర్తు చేస్తున్నారు.

మమ్ముల సతాయిస్తుండ్రు

నేను ఆరెకరాల్లో వరేసిన. నీటి ఎద్దడితోని మస్తు తక్లీబైంది. అటో..ఇటో చేసి పంటను కాపాడుకున్న. మొన్ననే కోసి వడ్లను సెంటర్‌కు తెచ్చిన. ఇక్కడ గడికో ముచ్చటజెప్పి మస్తు సతాయిస్తుండ్రు. తాలు వత్తందని అంటున్నరు. వాళ్లిచ్చిన మిషన్లనే వడ్లు పట్టినంక మల్ల తాలెట్ల వస్తదో సమజైతలేదు. వడ్ల గింజ చిన్నగుంది, దీనికి వేరే రేటు అంటున్నరు. 40కిలోల బ్యాగు మీద కిలోన్నర వడ్లు తరుగుదీస్తున్నరు. ఆరుగాలం కష్టపడి పండించి అమ్ముకునే టైంల గిట్ల సతాయించుడేందో నాకైతే సమజైతలేదు.

–కొరిగింజ నర్సింహులు, రైతు, మద్దూరు(సిద్దిపేట జిల్లా)

వడ్లు తెచ్చి వారమైంది

మా ఊర్లె కొనుగోలు కేంద్రం పెట్టి పదిహేను రోజులైంది. ఇప్పటివరకు ఒక్క లారీ కూడా పోలేదు. నేను వడ్లు తెచ్చి వారమైంది. వడ్లు పోసేందుకు ఇక్కడ జాగ కూడా లేదు. ఇంతవరకు బార్దాని ఇవ్వనేలేదు. నాకంటే ముందొచ్చిన వాళ్ల వడ్లు కూడా అమ్ముడుపోలేదు. మొగులు దిక్కు చూస్తే భయమైతాంది. ఎక్కడ వడ్లు తడుస్తయోనని!. వడ్లు ఎప్పుడు కొంటారో అని రోజూ చూసుడైతాంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు ఇట్ల లేకుండె. వడ్లు తేంగనే మ్యాచర్ చూసి రెండు రోజుల్లో కాంట పెట్టి లారీలకు ఎక్కిత్తురు. ఇప్పుడట్ల లేదు. కేంద్రాలు పెట్టినమని చెప్పుడే తప్ప కాంట అయిత లేదు. ఈ సారి పంటలు ఎండి నిరుడు యాసంగి కన్న తక్కువ వడ్లు వచ్చినయ్. రైతులను ఆగంజెయ్యకుండ వెంటనే వడ్లు కొనాలె.

–బుడిగె శ్రీనివాస్, గురువన్నపేట, కొమురవెల్లి మండలం (సిద్దిపేట జిల్లా)

యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాకలో ధర్నా చేస్తున్న రైతులు

లారీల కొరత తీర్చాలని రైతుల ధర్నా

ఆలేరురూరల్, ఏప్రిల్ 19 : ధాన్యం కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు అవసరమైన మేర లారీలు ఏర్పాటు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామంలో ఈ మేరకు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో కాంటా వేసిన ధాన్యాన్ని తరలించేందుకు లారీలు రాకపోవడంతో నిల్వలు పెరిగి పోతున్నాయని, అకాల వర్షాలు పడితే ధాన్యం తడిసి తాము నష్టపోయే ప్రమాదం ఉన్నదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. లారీల కొరత కారణంగా వారం రోజులుగా కొనుగోలు కేంద్రాల్లోనే రాత్రింబవళ్లు పడిగాపులు కాస్తున్నామని చెప్పారు. ఇప్పటికైనా అధికారులు లారీలను పంపించి తమ ధాన్యాన్ని మిల్లులకు తరలించాలని కోరారు.

మద్యం, డ్రగ్స్‌పై డేగకన్ను

- అన్ని చెక్‌పోస్టుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు
- డిస్టిలరీలు, బ్రూవరీలపై ప్రత్యేక నిఘా
- కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు 570 కెమెరాలు అనుసంధానం
- నెల రోజుల్లో రూ.30.12 కోట్ల మద్యం, డ్రగ్స్ స్వాధీనం
- ఎన్నికల ఏర్పాట్లపై 'నమస్తే తెలంగాణ'తో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ కమిషనర్ శ్రీధర్

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణలో మద్యం ప్రవాహంతోపాటు మాదకద్రవ్యాల సరఫరాను అడ్డుకునేందుకు అడుగడుగునా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టినట్టు ఎక్సైజ్ శాఖ కమిషనర్ శ్రీధర్ వెల్లడించారు. రాష్ట్రంలోని అన్ని చెక్‌పోస్టుల్లో ప్రత్యేకంగా సీసీకెమెరాలు ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రాష్ట్ర సరిహద్దుల్లో ఇప్పటికే ఉన్న 21 (ఏపీ సరిహద్దులో 8, మహారాష్ట్ర సరిహద్దులో 8, కర్ణాటక సరిహద్దులో 4, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో 1) శాశ్వత చెక్‌పోస్టులకు అదనంగా మరికొన్నింటిని ఏర్పాటు చేసి, 24 గంటూ తనిఖీలు చేపడుతున్నట్టు 'నమస్తే తెలంగాణ'కు వివరించారు.

అన్ని విభాగాల్లో సీసీ కెమెరాలు

రాష్ట్రంలోని 19 మద్యం డిపోలు, 19 డిస్టలరీలు, 6 బ్రూవరీల్లో అవకతవకలు జరగకుండా చూసేందుకు పటిష్ఠ చర్యలు చేపట్టినట్టు శ్రీధర్ తెలిపారు. దీనిలో భాగంగా ఇప్పటికే అన్ని విభాగాల్లో 570 సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించినట్టు చెప్పారు. గతంలో జరిగిన లోపాలను సరిదిద్దుకుంటూ, కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటున్నామని, మద్యం తయారీ కేంద్రాల నుంచి ప్యాకింగ్, లోడింగ్, షాపులకు చేరేవరకూ అడుగడుగునా పర్యవేక్షిస్తున్నామని, ఎక్కడైనా తప్పు జరిగితే వెంటనే చర్యలు చేపడుతున్నామని వివరించారు.

ప్రతినెలా 30 లక్షల కేసుల మద్యం

రాష్ట్రంలో ప్రతినెలా 30 లక్షల కేసుల మద్యం తయారవుతుందని, అమ్మకాలు కూడా అదేస్థాయిలో జరుగుతున్నాయని శ్రీధర్ తెలిపారు. ఈ ఏడాది మద్యం ఉత్పత్తి కొంత తగ్గినట్టు చెప్పారు. మద్యం అమ్మకాలు, పన్నులు, లైసెన్స్ ఫీజుల ద్వారా రాష్ట్ర ఎక్సైజ్ శాఖకు ప్రతినెలా దాదాపు రూ.3 వేల కోట్ల ఆదాయం వస్తున్నట్టు వెల్లడించారు. మద్యం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.32 వేల కోట్లు, నిరుడు రూ.35 వేల కోట్లు వచ్చినట్టు తెలిపారు. ఇటీవల ఎక్సైజ్ శాఖలో జరిగిన బదిలీలన్నీ ఎన్నికల కమిషన్ నిబంధనలకు లోబడే జరిగాయని, 'టానిక్ లిక్కర్ మార్ట్' కేసు విచారణలో ఉన్నదని చెప్పారు.

రూ.30.12 కోట్ల సొత్తు స్వాధీనం

రాష్ట్రంలో గత నెల 16 నుంచి ఈ నెల 18 వరకు రూ.30.12 కోట్ల విలువైన అక్రమ మద్యం, డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నట్టు శ్రీధర్ వెల్లడించారు. ఇందులో రూ.17.87 కోట్ల విలువైన 6,76,275 లీటర్ల మద్యం, రూ.12 కోట్ల విలువైన 319 కేజీల డ్రగ్స్ ఉన్నట్టు వివరించారు. ఐడీ లిక్కర్, నాన్-డ్యూటీ పెయిడ్ లిక్కర్ (ఎన్డీపీఎల్)ను అరికట్టేందుకు రాష్ట్రవ్యాప్తంగా స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఐడీ లిక్కర్ ఎక్కువగా ఉండే మంచిర్యాల, పెద్దపల్లి, నాగర్‌కర్నూల్, వరంగల్, మహబూబాబాద్, భూపాలపల్లి, ములుగు, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెంతోపాటు ఎన్డీపీఎల్ కేసులు ఎక్కువగా నమోదవుతున్న ఆదిలాబాద్, నిర్మల్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబ్‌నగర్, గద్వాల్, సంగారెడ్డి, నిజామాబాద్, కామారెడ్డి, ఖమ్మం, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, హైదరాబాద్‌లో విస్తృతంగా స్పెషల్ డ్రైవ్‌లు కొనసాగుతున్నట్టు చెప్పారు.

రాష్ట్రమంతా నిప్పుల కొలిమి

అంతటా పెరిగిన వడగాలులు, ఉక్కపోత

మంచిర్యాలలో 45.2 డిగ్రీల అత్యధిక ఉష్ణోగ్రత

వడదెబ్బ సోకి రాష్ట్రంలో ఐదుగురి మృత్యువాత

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ)/మంచిర్యాల ఏసీసీ/ములుగు రూరల్: భానుడి భగభగలతో రాష్ట్రమంతా నిప్పుల కొలిమిని తలపిస్తున్నది. గరిష్ఠ ఉష్ణోగ్రతలు పెరిగాయి. వడగాలులు, ఉక్కపోతతో జనం ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. శుక్రవారం రాష్ట్రంలోనే అత్యధికంగా మంచిర్యాలలో 45.2 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాల్లో మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. కొన్ని ప్రాంతాల్లో కర్ఫ్యూ వాతావరణం కనిపించింది. రాష్ట్రంలో శుక్రవారం ఒక్కరోజే వడదెబ్బ సోకి ఐదుగురు వ్యక్తులు మృత్యువాత పడ్డారు. రాబోయే రోజుల్లో గరిష్ఠంగా 2 నుంచి 3 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. పలు ప్రాంతాల్లో 43 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, ఆదివారం వరకు ఇదే పరిస్థితి కొనసాగుతుందని హెచ్చరించింది. శుక్రవారం వడదెబ్బ సోకి ములుగు జిల్లా ములుగు మండలం మదనపల్లికి చెందిన తాపీ మేస్త్రీ చీలపాక సాల్‌మోహన్ (50), సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణం పదో వార్డుకు చెందిన టైలర్ మొలుగూరి సురేశ్ (30), నిర్మల్ జిల్లా దస్తురాబాద్ మండల కేంద్రంలో వ్యవసాయ కూలీ రామగిరి లక్ష్మీనర్సయ్య (48), నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం చందనపల్లికి చెందిన హమాలీ గన్నెపాక కొండయ్య (48), సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ పట్టణానికి చెందిన సెక్యూరిటీ గార్డు కస్తాల మహేశ్ (45) మృతి చెందారు. ఈ నెల 22, 23 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా అక్కడక్కడా ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది. ఎండల నేపథ్యంలో మధ్యాహ్నం 12 నుంచి 3 గంటల మధ్య బయటకు వెళ్లొద్దని వైద్య, ఆరోగ్య శాఖ సూచించింది. తప్పక వెళ్లేవారు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది. పిల్లలు, వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు, గర్భిణులు చాలా జాగ్రత్తగా ఉండాలని అధికారులు సూచించారు.

వర్షపు చినుకులు మరోవైపు

రాష్ట్రంలో ఒకవైపు ఎండలు మండుతుంటే కొన్నిచోట్ల ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. శుక్రవారం హైదరాబాద్‌తోపాటు వివిధ చోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం పడింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ ప్రాంతంలో వర్షం పడగా కామారెడ్డి జిల్లాలో పలు చోట్ల ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. జిల్లాలోని రామారెడ్డి, మాచారెడ్డి మండలాల్లో భారీ వర్షం పడగా, కుట్టకింది తండాలో ఈదురుగాలుల ధాటికి ఇంటి రేకులు ఎగిరిపడ్డాయి.

ఎండలు ఫుల్.. బీర్లతో చిల్

18 రోజుల్లో రూ.670 కోట్ల అమ్మకాలు

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): భారీగా పెరిగిన ఎండలు, వరుసగా వచ్చిన సెలవులు, పెండ్లిళ్ల సీజన్ సందర్భంగా ఈనెల తెలంగాణలో భారీగా బీర్ల అమ్మకాలు పెరిగాయి. ఈనెల 1 నుంచి 18 వరకు రూ.670 కోట్ల విలువైన బీర్లను తాగేశారు. ఏప్రిల్ 1 నుంచి 18 వరకు 23,58,827 కేస్‌ల బీర్లు అమ్మడయ్యాయి. ఇది ఇప్పుడు ఆల్‌టైమ్ రికార్డు. గతేడాది ఇదే నెలలో అమ్ముడైన రికార్డును బ్రేక్ చేస్తూ.. ఈ ఏడాది అధికంగా 28.7 శాతం బీర్ల అమ్మకాలు జరిగాయి. దీంతో రాష్ట్రంలో ఎక్కడా కూడా బీర్ల కొరత లేకుండా ఎక్సైజ్ అధికారులు చూస్తున్నారు.

హామీలు బుట్టదాఖలు: వాసుదేవరెడ్డి

- నాలుగు నెలల్లోనే అగమ్యగోచరం
- కాంగ్రెస్,బీజేపీతో తెలంగాణకు నష్టం

హైదరాబాద్, ఏప్రిల్ 19 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో రైతులు పండించిన పంటకు సరైన గిట్టుబాటు ధర లభించడంలేదని, పేరుకు వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలు పెట్టినా ఎక్కడా కొనుగోళ్లు జరగడం లేదని బీఆర్ఎస్ నేత వాసుదేవరెడ్డి ఆరోపించారు. రోజుల తరబడి రైతులు వేచి చూస్తున్నారని చెప్పారు. రైతులు పండించిన పంటలను కనీస మద్దతు ధర చెల్లించి కొనాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలు ఒట్టి మాటలే అయ్యాయని, రైతులకు ఇస్తానన్న రూ.500 బోనస్ ఇవ్వడలేదని విమర్శించారు. అసెంబ్లీలో ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అరచేతిలో వైకుంఠం చూపించి అబద్ధపు హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిందని, ఒక్క హామీ కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేకపోయిందని వాసుదేవరెడ్డి అన్నారు. కాంగ్రెస్ 4 నెలల కాలంలో ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైందని ఆందోళన వ్యక్తం చేశారు. జాతీయ పార్టీలైన కాంగ్రెస్, బీజేపీలతో తెలంగాణకు నష్టమేనని, ప్రజల పక్షాన నిలబడే బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులనే లోకసభ ఎన్నికల్లో గెలిపించాలని కోరారు.